

# నష్టపుటేరులు

స్టాక్ మార్కెట్లకు మోదీ షాక్ • భీకర నష్టాల్లో సూచీలు

తీవ్ర అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు

సెన్సెక్స్ 4,390.. నిఫ్టీ 1,379 పాయింట్లు క్షీణత

ఒక్కరోజే రూ.31 లక్షల కోట్లు ఆవిరైన సంపద

21 శాతం నష్టపోయిన అదానీ షేర్లు

ముంబై, జూన్ 4: దేశీయ స్టాక్ మార్కెట్లు షేకైపోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి అరకొర మెజారిటీ రావడం మదుపరులు జీర్ణించుకోలేకపోయారు. మంగళవారం ఫలితాల సరళికి తగ్గట్టుగా ఉదయం ఆరంభం నుంచే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల తీవ్రత పెరుగుతూనే పోయింది. మదుపరులు భీకర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే ఒక దశలో కరోనా లాక్‌డౌన్ సమయంలో వాటిల్లిన భారీ నష్టాలను సైతం సూచీలు దాటిపోయాయి. మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 6వేల పాయింట్లకుపైగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సుమారు 2,000 పాయింట్ల వరకు క్షీణించాయి. అయితే ఆ తర్వాత కోలుకున్నాయి. అయినప్పటికీ సెన్సెక్స్ 4,389.73 పాయింట్లు లేదా 5.74 శాతం నష్టపోయి రెండు నెలలకుపైగా కనిష్ఠ స్థాయిని తాకుతూ 72,079.05 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 1,379.40 పాయింట్లు లేదా 5.93 శాతం కోల్పోయి 21,884.50 వద్ద స్థిరపడింది. పాయింట్ల లెక్కన ఇవే దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలకు అత్యంత భారీ నష్టాలు. అయితే పర్సంటేజీల్లో చూస్తే.. 2020 మార్చి 23న కరోనా లాక్‌డౌన్‌ను విధించడంతో సూచీలు దాదాపు 13 శాతం పతనమయ్యాయి. ఇదే ఇప్పటిదాకా రికార్డు స్థాయి.

## రూ.31 లక్షల కోట్లు ఫట్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల మధ్య మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో కరిగిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.31,07,806.27 కోట్లు తరిగిపోయింది. రూ.400 లక్షల కోట్లకు దిగువన రూ.3,94,83,705.27 కోట్ల (4.73 ట్రిలియన్ డాలర్ల)కు పరిమితమైంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో సోమవారం రూ.13.78 లక్షల కోట్లు పెరిగిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం అంచనాలకు దూరంగా ఫలితాలు రావడంతో అంతకు రెండున్నర రెట్లు క్షీణించింది. ఈ నష్టాలతో అటు బీఎస్ఈ, ఇటు ఎన్ఎస్ఈ కంపెనీల మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల మార్కును కోల్పోయాయి. ఇక 2014 మే 16న బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.80,63,812.03 కోట్లుగా ఉన్నది. 2019 మే 23న రూ.1,50,17,577.28 కోట్లు. మొత్తంగా గత పదేండ్లలో రూ.314.19 లక్షల కోట్లు పెరిగింది.

### ఇంట్రాడే బీభత్సం

ఈసారి కేంద్రంలో బీజేపీకి సొంతంగానే కాదు.. మిత్రపక్షాల మద్దతుతో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటన్ని సీట్లు వస్తాయో? లేదో? అన్న అనుమానాలు మదుపరులలో రేకెత్తాయి. దీంతో పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగారు. ఫలితంగా ఒకానొక దశలో మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ 6,234.35 పాయింట్లు లేదా 8.15 శాతం పడిపోయింది. 5 నెలల కనిష్ఠాన్ని సూచిస్తూ 70,234.43 వద్దకు పడింది. ఇదే సమయంలో నిఫ్టీ సైతం 1,982.45 పాయింట్లు లేదా 8.52 శాతం దిగజారింది. 21,281.45 వద్దకు తగ్గింది. నిజానికి ఎగ్జిట్ పోల్స్‌లో మెజారిటీ సర్వే సంస్థలు ఇచ్చిన అంచనాలకు విరుద్ధంగా వాస్తవ ఫలితాలు వచ్చాయి. ఇవి మదుపరులకు అస్సలు రుచించలేదు. అందుకే సోమవారం ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో 3 శాతానికిపైగా పెరిగినా.. మంగళవారం కుప్పకూలాయి.

### అల్లాడిపోయిన అదానీ షేర్లు

అదానీ గ్రూప్ షేర్లు అల్లాడిపోయాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గౌతమ్ అదానీ అత్యంత ఆప్త మిత్రుడన్న విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల ఫలితాల ప్రభావం అదానీ షేర్లపై పెద్దగానే కనిపించింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో గౌతమ్ అదానీకి చెందిన మొత్తం 10 కంపెనీలు నమోదవగా.. వీటి మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.3.64 లక్షల కోట్లు హరించుకుపోయింది మరి. ఈ సంస్థల మార్కెట్ విలువ సోమవారం ట్రేడింగ్ ముగిసే నాటికి రూ.19,42,712.91 కోట్లుగా ఉన్నది. కానీ మంగళవారం రూ.15,78,346.79 కోట్లకు పరిమితమైంది. ఇక 8 కంపెనీలు లోయర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకాయి. ఒకానొక దశలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ షేర్లు 25 శాతం క్షీణించాయి. అంబుజా సిమెంట్స్ షేర్లు కూడా 22.5 శాతం నష్టాలను చూశాయి.

ఊహించనివిధంగా బీజేపీ, ఎన్డీఏ కూటమికి మెజారిటీ తగ్గిపోవడం మదుపరులను ఒక్కసారిగా భయాందోళనకు గురిచేసింది. దీంతో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు దిగారు. మూడోసారీ కేంద్రంలో మోదీ సర్కారే వస్తున్నదని తెలిసినా.. అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. అందుకే ఈ భారీ నష్టాలు.

*-వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్*

290 సీట్లకే ఎన్డీఏ కూటమి పరిమితమవుతుండటాన్ని మదుపరులు జీర్ణించుకోలేకపోయారు. ఎగ్జిట్ పోల్స్‌లో 350-370 సీట్లు వస్తాయని అంచనాలున్నాయి. అందుకే మదుపరులు అమ్మకాలకు దిగారు. భాగస్వామ్య పక్షాల మీద ఆధారపడి పాలసీ నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండటమే నష్టాలకు కారణం.

*-మనీష్ చౌధరి, స్టాక్స్‌బాక్స్ రిసెర్చ్ హెడ్*

- **రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ 7.50 శాతానికిపైగా క్షీణించింది. దీంతో సంస్థ మార్కెట్ విలువ రూ.1.54 లక్షల కోట్లు పడిపోయింది.**
- **ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, చమురు, గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు భారీ నష్టాలు. గరిష్ఠంగా 14.40 శాతం పతనమైపోయాయి.**
- **2014 మే 16న ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీని విజయం వరించినప్పుడు సెన్సెక్స్ 261.14 పాయింట్లు, నిఫ్టీ 79.85 పాయింట్లు పెరిగాయి. ఇంట్రా-డేలో సెన్సెక్స్ 25వేల మార్కును తాకింది.**
- **2019 మే 23న తిరిగి రెండోసారి అధికారంలోకి రావడంతో సెన్సెక్స్ 298.82 పాయింట్లు, నిఫ్టీ 80.85 పాయింట్లు పెరిగాయి. ఇంట్రా-డేలో తొలిసారి సెన్సెక్స్ 40,000 మార్కును చేరింది. నిఫ్టీ 12,000 స్థాయికి వెళ్లింది.**
- **డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 37 పైసలు తగ్గి 83.51వద్దకు జారుకున్నది.**

### అదానీ గ్రూప్‌లో అల్లకల్లోలం

| కంపెనీ | నష్టం (శాతాల్లో) |
|---|---|
| అదానీ పోర్ట్స్ | 21.26 |
| అదానీ ఎనర్జీ | 20 |
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 19.35 |
| అదానీ గ్రీన్ ఎనర్జీ | 19.20 |
| అదానీ టోటల్ గ్యాస్ | 18.88 |
| ఎన్డీటీవీ | 18.52 |
| అదానీ పవర్ | 17.27 |
| అంబుజా | 16.88 |
| ఏసీసీ | 14.71 |
| అదానీ విల్మార్ | 9.98 |

### సెన్సెక్స్ టాప్-10 నష్టాలు

| | |
|---|---|
| 2024 జూన్ 4 | 4,389.73 |
| 2020 మార్చి 23 | 3,934.72 |
| 2020 మార్చి 12 | 2,919.26 |
| 2020 మార్చి 16 | 2,713.41 |
| 2022 ఫిబ్రవరి 24 | 2,702.15 |
| 2020 మే 4 | 2,002.27 |
| 2020 మార్చి 9 | 1,941.67 |
| 2021 ఫిబ్రవరి 26 | 1,939.32 |
| 2022 ఫిబ్రవరి 14 | 1,747.08 |
| 2020 మార్చి 18 | 1,709.58 |

# 73వేలకు బంగారం

- **రూ.500 వరకు పెరిగిన తులం**



న్యూఢిల్లీ, జూన్ 4: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అనూహ్య స్పందనకు తోడు దేశీయ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపరులు సురక్షితమైన బంగారం వైపు తమ పెట్టుబడులను తరలించడంతో వీటి ధరలు అధికమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర రూ.450 ఎగబాకి రూ.73 వేల దిశగా పయనిస్తున్నది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి బంగారం ధర రూ.72,900 వద్ద నిలిచింది. అటు వెండి కూడా రూ.200 అందుకొని రూ.93,100 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.760 అందుకొని రూ.72,870కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.72,110గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ పుత్తడి ధర రూ.700 ఎగబాకి రూ.66,100 నుంచి రూ.66,800కి చేరుకున్నది. గత ఐదు రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు మంగళవారం భారీగా పెరిగాయి. కిలో వెండి ఏకంగా రూ.1,200 ఎగబాకి రూ.97,300 నుంచి రూ.98,500 పలికింది. గత నాలుగు సెషన్లలో రూ.5 వేల వరకు తగ్గింది.

## అశోక్ లేలాండ్ ‘సారథి సురక్ష పాలసీ’

### డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు బీమా కవరేజ్

చెన్నై, జూన్ 4: కమర్షియల్ వాహన తయారీ సంస్థ అశోక్ లేలాండ్..డ్రైవర్ల కోసం ‘సారథి సురక్ష పాలసీ’ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాలసీ కింద డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు బీమా కల్పిస్తున్నది. కంపెనీకి చెందిన వాహనాలను నడిపే డ్రైవర్లకు అన్‌నేమ్డ్ జీపీఏ(గ్రూపు పర్సనల్ యాక్సిడెంట్) పాలసీతో పరిహారం లభించనున్నది. ప్రమాదంలో మరణించిన డ్రైవర్‌కు, శాశ్వత లేదా పాక్షిక వైకల్యం పొందిన వారికి రూ.10 లక్షల ప్రమాద బీమాతోపాటు వారి పిల్లలకు ప్రత్యేక విద్యాను అందించనున్నారు. లాజిస్టిక్, రవాణా విభాగంలో తమ డ్రైవర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ పాలసీని ప్రవేశపెట్టినట్టు, ఒకవేళ డ్రైవర్ మరణిస్తే వారి కుటుంబం పెద్ద దిక్కు కోల్పోకుండా ఉండేందుకు బీమా రూపంలో పది లక్షల రూపాయలతోపాటు వారి పిల్లలకు చదువును కూడా చెప్పిస్తున్నట్లు అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేను అగర్వాల్ తెలిపారు. డ్రైవర్లపై సంస్థకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు.

## స్పెక్ట్రం వేలం వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 4: స్పెక్ట్రం వేలంను మరోసారి వాయిదా వేసింది డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం(డీవోటీ). ఈ నెల 25న వాయు తరంగాలను వేలం వేయనున్నట్లు తాజాగా వెల్లడించింది. గతంలో ఈ గురువారం(జూన్ 6న) విక్రయించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈసారి నిర్వహిస్తున్న స్పెక్ట్రం వేలంతో రూ.96 వేల కోట్లకు పైగా నిధులు రావొచ్చని కేంద్రం అంచనావేస్తున్నది. 800 మెగాహెట్జ్, 900 మెగాహెట్జ్, 1,800 మెగాహెట్జ్, 2,100 మెగాహెట్జ్, 2,300 మెగాహెట్జ్, 2,500 మెగాహెట్జ్, 3,300 మెగాహెట్జ్, 26 గిగాహెడ్జ్ బాండ్ విడ్త్‌తో స్పెక్ట్రాన్ని వేలం వేయబోతున్నది. ఈ వేలం పాల్గొనడానికి రిలయన్స్ జియో అత్యధికంగా రూ.3 వేల కోట్లు జమచేయగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్ రూ.1,050 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.300 కోట్లు జమ చేశారు.

### కరీంనగర్‌లో క్యాంబ్రిడ్జి సెంటర్

హైదరాబాద్, జూన్ 4: వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణలోని కరీంనగర్‌లో తొలి క్యాంబ్రిడ్జి లెర్నింగ్ పార్ట్‌నర్(సీఎల్‌పీ)ని ప్రారంభించినట్లు క్యాంబ్రిడ్జి. 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌తో వెయ్యి మంది వరకు ప్రయోజనం లభించనున్నదని తెలిపింది. ఏడీ ఓవర్‌సీస్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్ కోచింగ్ ఇవ్వడంతోపాటు వీసా కన్సల్టేషన్ ప్రయోజనాలు కూడా పొందవచ్చునని తెలిపింది.

### కల్యాణ్ చేతికి క్యాండేర్

హైదరాబాద్, జూన్ 4:ఆన్‌లైన్లో ఆభరణాలు విక్రయించే క్యాండేర్‌ను హస్తగతం చేసుకున్నది కల్యాణ్ జ్యువెల్లర్స్. మరో 15 శాతం వాటాను కొనుగోలు చేయడానికి కల్యాణ్ జ్యువెల్లర్స్ రూ.42 కోట్ల నిధులు వెచ్చించింది. ఈ-కామర్స్, ఒమినిచానెల్‌ను మరింత దృష్టి సారించడంలో భాగంగా కల్యాణ్ జ్యువెల్లర్స్ ఈ కొనుగోలు జరిపింది. మూడు దశల్లో జరిగిన ఈ ఒప్పందం పూర్తికావడంతో క్యాండేర్..ఇక కల్యాణ్ జ్యువెల్లరీ పరిధిలోకి చేరింది.

చిత్రం



## ఎవ్వరికీ అందని రేంజ్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నియోజక వర్గం నుంచి అగ్ర హీరో పవన్‌కల్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ విజయంతో ఆయన అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు ఫలితం దక్కిందని సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్‌కల్యాణ్ తాజా చిత్రం ‘ఓజీ’ నుంచి మేకర్స్ కొత్త పోస్టర్‌ను సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. దీనికి ‘ఎవ్వరికీ అందదు అతని రేంజ్..రెప్ప తెరిచేను రగిలే రివేంజ్’ అనే క్యాప్షన్‌ను జోడించారు. కొత్త పోస్టర్‌లో పవన్‌కల్యాణ్ స్టైలిష్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.



## రవితేజతో వన్స్‌మోర్

అచ్చ తెలుగు అందం శ్రీలీలకు టైమ్ కలిసి రావడం లేదు. భారీ సినిమాల్లో అవకాశాలు వరించినా..ఆ స్థాయిలో విజయాలను మాత్రం దక్కించుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు రవితేజతో జోడీగా నటించబోతున్నదని తెలిసింది. వివరాల్లోకి వెళితే.. రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించనుంది. ఈ చిత్రాన్ని ఈ నెలలోనే లాంఛనంగా ప్రారంభించడంతో పాటు రెగ్యులర్ షూటింగ్‌ను కూడా మొదలుపెట్టబోతున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. గతంలో రవితేజతో కలిసి ‘ధమాకా’ చిత్రంలో నటించింది శ్రీలీల. ఈ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. దాంతో తాజా సినిమా అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ప్రస్తుతం శ్రీలీల తెలుగులో పవన్‌కల్యాణ్ సరసన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ చిత్రంలో నటిస్తున్నది.



## అండమాన్‌లో యాక్షన్

అగ్ర హీరో సూర్య కథాంశాల ఎంపికలో ప్రయోగాలకు పెద్ద పీట వేస్తారు. ప్రతి సినిమాలో తనని తాను కొత్తగా ఆవిష్కరించుకోవాలని తపిస్తారు. ప్రస్తుతం ఆయన ‘కంగువ’ అనే పీరియాడిక్ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఓ యుద్ధవీరుడి గాథగా తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో సూర్య నటిస్తున్న తాజా చిత్రం మంగళవారం అండమాన్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని కూడా పీరియాడిక్ కథతో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ సినిమా మొదలైన విషయాన్ని తెలియజేస్తూ సూర్య ఎక్స్‌లో (ట్విట్టర్) ఓ వీడియోను పంచుకున్నారు. ప్రేమ, యుద్ధం, వినోదం అంశాల కలబోతగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే చిత్రమిదని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తెలిపారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ‘మనమే’ ఓ సరికొత్త ప్రయోగం



ఖుషి, హాయ్ నాన్న చిత్రాల ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు స్వరకర్త హేషమ్ అబ్దుల్ వహాబ్. మెలోడీ ప్రధానంగా ఆయన బాణీలు సంగీత ప్రియుల్ని ఆకట్టుకున్నాయి. ఆయన సంగీత దర్శకత్వం వహించిన తాజా చిత్రం ‘మనమే’. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ ‘ఈ సినిమాలో 16 పాటలుంటాయి. ఇదొక ప్రయోగంలా భావించాను. ఫస్టాఫ్‌లోనే పది పాటలొస్తాయి. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య అద్భుతమైన కథను సిద్ధం చేశాడు. కథలోని భావోద్వేగాలకు అనుగుణంగా మంచి పాటలు కుదిరాయి. ఈ పదహారు పాటల్లో ఐదు బిట్‌సాంగ్స్‌గా వస్తాయి’ అన్నారు. ఖుషి, హాయ్ నాన్న తర్వాత తెలుగులో ఈ సినిమాకు మ్యూజిక్ చేయడం ఆనందంగా ఉందని, తన సంగీత పరిజ్ఞానాన్ని మొత్తం వ్యక్తీకరించడానికి ‘మనమే’ మంచి అవకాశాన్నిచ్చిందని హేషమ్ అబ్దుల్ వహాబ్ తెలిపారు. తెలుగు ప్రజలు మ్యూజిక్‌ను గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారని, హైదరాబాద్ తనకు సెకండ్ హోమ్‌లా మారిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.




## ‘సత్యభామ’ మహిళలకు స్ఫూర్తినిస్తుంది

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ నటిస్తున్న తాజా చిత్రం ‘సత్యభామ’. సుమన్ చిక్కాల దర్శకుడు. అవురమ్ ఆర్ట్స్ సంస్థ తెరకెక్కించింది. ఈ చిత్రం నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్ర నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కళ్లపల్లి పాత్రికేయులతో మాట్లాడుతూ ‘నిర్మాతలుగా మాకిది తొలి ప్రయత్నం. డిస్ట్రిబ్యూషన్‌లోనూ మాకు అనుభవం ఉంది. మంచి కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాను మొదలుపెట్టాం. క్రైమ్ థ్రిల్లర్ కథాంశమిది. ఇరవై ఏళ్ల క్రితం యూకేలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా కథను తయారు చేశాం. మన నేటివిటీకి అనుగుణంగా కథను తీర్చిదిద్దాం. స్టోరీ విన్న వెంటనే కాజల్ ఈ సినిమాకు ఓకే చెప్పింది. అసాధ్యమనుకున్న పనిని ఓ మహిళ ఎలా సాధించిందన్నదే ఈ సినిమా ఇతివృత్తం. ఈ సినిమా చూశాక సెన్సార్ బృందంలోని మహిళా సభ్యులు మా టీమ్‌ను అభినందించారు. ఈ సినిమాలో షీసేఫ్ యాప్ ప్రస్తావన ఉంటుంది. దానిని మరింత మంది ఉపయోగించాలనే అంశాన్ని తెలియజెప్పాం. కాజల్ అగర్వాల్ పర్‌ఫార్మెన్స్ హైలైట్‌గా నిలుస్తుంది. శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. మా తదుపరి చిత్రాలను పాన్ ఇండియా స్థాయిలో తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉన్నాం’ అన్నారు.



## వినోదాల ప్రేమాయణం



విశ్వంత్, అనురూప్, విస్మయ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం ‘నమో’. ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకుడు. ఏ.ప్రశాంత్ నిర్మించారు. ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు భీమనేని శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు ఆదిత్యరెడ్డి మట్లాడుతూ ‘వినూత్నమైన సబ్జెక్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. రొటీన్ ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది. కథానుగుణంగా చక్కటి సంగీతం కుదిరింది’ అన్నారు. అన్ని కమర్షియల్ హంగులు కలబోసిన పైసా వసూల్ చిత్రమిదని హీరో విశ్వంత్ తెలిపారు. ప్రేక్షకులను ఆద్యంతం నవ్వించే చిత్రమిదని నిర్మాత ప్రశాంత్ పేర్కొన్నారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.